'స్వాతి' వారపత్రిక - 2.1.1987

# జేబులో తేలు

అతడు-

మైదానంలో మనుషుల మధ్య మనవలసినవాడు.

మసలవలసినవాడు.

మృగాల మధ్య-

అడవిలో!

అవును - అతను వుంటున్నది అడవిలో. అక్కడ ఏది దొరికితే అదే తిండి.

కటికనేలపై నిద్ర.

అయ్యా- అతను టార్జన్ కాదు.

రాంబో కాదు కాదు.

అతడు పుట్టి పెరిగింది మైదానంలోనే. చదువు సంధ్యలు నేవార్చింది మైదానంలోనే.

అంతకన్నా లోకాన్ని చదివి మేధావిగా రూపొందింది అక్కడే.

అక్కడున్నప్పుడే తనొక భ్రష్టుపట్టిపోయిన సమాజంలో వున్నట్టు గ్రహించేడు.

గ్రహించేక, దాని స్థానంలో నూతన వ్యవస్థను ఆవిష్కరించవలసి వున్నదని భావించేడు.

అలా భావించిన వారితో చేతులు కలిపేడు.

అందుకు ఉద్యమించేడు.

విప్లవించేడు.

దాంతో -

అతనికి కష్టాలు మొదలు.

ఇబ్బందులు ఎదురు.

ఏ కష్టాలు అతన్ని లక్ష్యాన్నుండి డీవియేట్ చేయగలవు?

ఏ ఇబ్బందులు అతని ధ్యేయాన్ని డైవర్ట్ చేయగలవు?

అతను ప్రవాహంలా, ప్రభంజనంలా ముందుకు సాగిపోతూనే వున్నాడు. సాగే మనిషిపై-

ఆ స్థితిలో శతృవు నిఘా వేయకుండా వుండునా?

అతడు యు.జి.కి వెళ్ళక తప్పింది కాదు.

మైదానం నుంచి...

దూరంగా అడవికి.

అవును- అడవికి!

అడవిలో -

క్రూరమృగాల మధ్య -

విషసర్పాల నెలవుల్లో -

ప్రాణాలు హరించే పురుగూ, పుట్రా మసలే తావుల్లో -

ఉండేది ఎలా అని అతని గుండెలు గుబగుబలాడేయి - మొదట్లో.

అది బెదురే కాని భయం కాదు. కాదు. అది కూడా ఎన్నాళ్ళో లేదు.

ఇపుడతనికి -

ఏ క్రూరమృగాలన్నా, ఎంతటి విషసర్పాలు కన్నా, ఎలాంటి పురుగూ పుట్రా వున్నా, బెదురు లేదు, భయం లేదు.

ఆయా వన్యజీవుల స్వభావం తెల్సుకున్నాడు.

అవి ఎప్పుడు ఎక్కడ ఉంటాయో - వుంటే వాటికి ఎలా దూరంగా వుండవచ్చో అర్థమయింది.

అప్పటికి ప్రమాదమైతే, అవి ఎలా దాడి చేస్తాయో -

దాడి చేస్తే వాటిని ఎలా ఎదుర్కోవచ్చో, లేక ఎలా తప్పుకోవచ్చో-

అతనికి అవగతమయింది.
అవంటే బెదురు పోయింది.
అవంటే భయం పోయింది.
అతడిప్పుడు -
మనుషులకు దూరంగా
మృగాల మధ్య -
విషసర్పాల మధ్య -
విష పురుగుల మధ్య -
క్షేమంగా -
బాగానే వున్నాడు.
వుంటూ, తన సహచరులతో
ఉద్యమం కొనసాగిస్తూనే వున్నాడు.
ఇలా వుండగా -
ఒకానొక రోజు -
తన లక్ష్యసాధనలో భాగంగా -
అడవి నుంచి... మైదానంకి వెళ్ళాల్సి వచ్చి వెళ్ళేడు. అడవి నుంచి... మైదానంకి
ఎంతో జా....గ...ర్త...గా...
మరెంతో మెలకువగా వుంటే ఆ బ్రహ్మకైనా అంతుబట్టని రీతిలో అతడు అడవి నుంచి - మైదానంలోకి ప్రవేశించాడు.
మృగాల నుంచి మనుషుల మధ్యకు వచ్చేడు.
దేవుడికే అంతు చిక్కని అతడు -
శత్రువుకి ఎలా చేజిక్కుతాడు?
అతనికి మైదానంలో
శత్రువు - వర్గశత్రువే కాదు -
మిత్రుడు - ప్రాణమిత్రుడూ గలడు.
తనకీ, ఉద్యమానికీ సహాయ సహకారాలు అందిస్తున్న మిత్రుడు - ఆప్తమిత్రుడు అతడు.
మైదానంలో-
చిట్టచీకటిలో-
అడుగులో అడుగేసుకుంటూ -
అటూ ఇటూ చూసుకుంటూ -
నెమ్మదిగా -
తలుపు తట్టేడు.

వెంటనే తెరుచుకోలేదు.
మళ్ళీ తట్టేడు.
ఆ తట్టే విధానం బట్టి వచ్చిందెవరో లోనున్న మిత్రుడు గ్రహించగలడు.
తెరుచుకున్నాయి తలుపులు.
ఎదురుగా మిత్రుడు.
చిరునగవుతో, ఆప్యాయంగా చేతులు చాస్తూ ఆహ్వానిస్తున్న మిత్రుడు.
లోనకి అడుగు పెట్టేడు అతడు.
తలుపులు ఎప్పటిలా నెమ్మదిగా కాకుండా దబ్మని వెన్వెంటనే మూసుకున్నాయి.
అంతే!
అయిపోయింది.
అంతా అయిపోయింది.
అతను ఏ మాత్రం ఊహించని దారుణం జరిగిపోయింది.
వ్యవస్థాపరంగా ఎవరు ఎవరు శత్రువులో స్పష్టంగా అంచనా వేయగలిగిన అతడు -
అడవిలో జంతుజాలాల, విషసర్పాల స్వభావాన్ని స్పష్టాతి స్పష్టంగా అర్థం చేసుకోగలిగిన అతడు -
ఒక నరమానవుని విషయంలో-
అందులోనూ ప్రాణమిత్రుడు...!
అయ్యో... ఎందుకిలా జరిగింది?
ఎక్కడ పొరపాటు జరిగింది?
ఆ మిత్రుని చిరునగవు వెనుక వేయి కాలకూట విషసర్పాల విషపు సంచులున్నాయని-
ఆప్యాయంగా చాచిన చేతులు విషసర్పాల్లా చుట్టుకుంటాయని -
పులి పంజాగా మారి దెబ్బతీస్తాయని, దాడి చేస్తాయని -
కాసుకోలేక పోయేడు.
ఆ మిత్రుని గుండె కుహరాల్లో పొంచివున్న క్రూరమృగాలని -
కాసుకోలేక పోయేడు.
అతడు మిత్రుడు కాదు - ద్రోహి.
అతడు మనిషి కాదు - తేనె పూసిన కత్తి.
అతడు నిలువల్లా విషం నిండిన త్రాచు.
అతడు గోముఖ వ్యాఘ్రం.
అతడు జేబులో తేలు!
అడవిలో అక్కడ- ఏ పుట్టలో ఏ పాముందో తెల్సుకోగలిగిన తను -
మైదానంలో ఇక్కడ - ఏమనిషిలో ఏ విషనాగులున్నాయో తెల్సుకోలేకపోయేడు.